# బండన్యాయం, బతుకుతో చెలగాటం

## కొల్లేరు - ప్రభుత్వ వ్యవహారం

జయప్రకాష్ నారాయణ్
(రచయిత లోక్‌సత్తా, 'ఓట్ ఇండియా'ల సమన్వయ కర్త)

**Bhavishyat Bharatam 22-May-2006**

ఓ రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యంలో కూడా బహిరంగ చర్చలో ఎంత గందరగోళం చోటుచేసుకోవచ్చో కొల్లేరు ఉదంతం రుజువు చేస్తోంది. విషయపరిజ్ఞానం లేకపోవటం, అవగాహన లేమి, మనకు ఇబ్బంది కలగనంతవరకు ఇతరులు ఎంత వేదన పడుతున్నా పట్టించుకోని ధోరణి, ప్రజల హక్కులు, రాజ్యాంగ విలువల పట్ల ఉదాసీనత - ఇవన్నీ కలగలసి, కొల్లేరు ప్రాంతానికి చెందిన రెండున్నర లక్షల మంది ప్రజల భవిష్యత్తును ఆగాధంలోకి నెడుతున్నాయి. సమస్యపై సరైన పరిశీలన లేకుండా, దున్నపోతు ఈనిందంటే దూడని కట్టేయమనే ధోరణి ప్రబలిపోయింది.

### *బెదిరించి మరీ ప్రోత్సహించారు*

కొల్లేరు- కృష్ణా, గోదావరి డెల్టాల మధ్యనున్న పల్లపు ప్రాంతం. రెండు డెల్టాలలోను కాల్వల చివరి భూములు కావటంతో వర్షం లేనప్పుడు పంట తడవదు. పల్లపు ప్రాంతం కావటంతో వర్షం పడితే ముంపునకు గురయ్యేది. ముంపునకు ముందు; డుపు విషయంలో వెనక - ఇదీ అక్కడివారి పరిస్థితి! ఇలా అనావృష్టి, అతివృష్టి మధ్య ఆ ప్రాంతం పంటలు లేక, బీదరికంలో కూరుకుపోయింది. అలాంటి ప్రాంతంలో 1970లలో జలగం వెంగళరావు ప్రభుత్వం చేపల పెంపకాన్ని ప్రోత్సహించింది. నీటి కొరత, వరద ముంపు మధ్య నిరంతరం నష్టపోయే బీద ప్రాంతంలో, మురుగునీటి కాల్వల లోంచి నీటిని తోడు కుని చేపలు పెంచితే ఆదాయం వస్తుందని, ఆనాటి నిస్సహాయస్థితిని అవకాశంగా మలుచుకోవచ్చని అప్పటి నాయకత్వం, అధికార యంత్రాంగం ప్రజలకి నచ్చచెప్పింది. కొల్లేరు పల్లపు ప్రాంతాలలోని (5 అడుగుల దిగువ ఉన్న) గ్రామాలలో నివసించే వారంతా బాగా వెనకబడ్డ కులమైన వడ్డీలు, దళితులు. చేపల పెంపకం తెలియక, చెరువుల తవ్వకానికి సిద్ధపడకపోతే, ఆ గ్రామాలలో ప్రజలని బెదిరించారు; పోలీస్‌స్టేషన్లకి తీసుకుపోయారు. కృష్ణాజిల్లాలో సంతానం, పశ్చిమగోదావరిలో కుమారస్వామిరెడ్డి, ఆ తరువాత వచ్చిన అధికారులు 1990ల దాకా ఇలా చేపల పెంపకాన్ని ప్రోత్సహించారు. రైతులకి రుణాలి చ్చారు. బీదలకు ప్రభుత్వ భూములని డి-ఫారం పట్టాలిచ్చారు. సహకార సంఘాలను ఏర్పాటుచేసి ఉమ్మ డిగా మరికొన్ని భూములనిచ్చారు. ఇలా 20,000 ఎకరాల జిరాయితీ భూమి (వారసత్వంగా వచ్చిన సొంతాస్తి), ప్రభుత్వం బీదలకి ఇచ్చిన దాదాపు 10,000 ఎకరాల భూములు కొల్లేరు ప్రాంతంలో 5 అడు గుల దిగువన ఉన్నాయి. ఆరంభంలో చేపల పంట రాక నష్టపోయారు; అప్పుల పాలయ్యారు. కాలక్ర మేణా చేపల పెంపకం నేర్చుకున్నారు. ఇప్పుడు ఎకరానికి 3 నుంచి 5 టన్నుల ఉత్పత్తి చేస్తున్నారు. కొల్లేరు ప్రాంతంలో 10 అడుగుల లోపు ప్రాంతంలో లక్షన్నర ఎకరాల వరకు చేపల చెరువులున్నాయని

అంచనా. ఏటా దాదాపు 6 లక్షల టన్నుల చేపల ఉత్పత్తి జరుగుతోంది. ఒకప్పుడు కొల్లేరులో సహజంగా పెరిగే చేపలు ఏటా 15 వేల టన్నులు అమ్మేవారు. ప్రస్తుతం 40 రెట్లు ఉత్పత్తి పెరిగింది. దేశమంతటా ప్రధానంగా చేపలు బాగా తినే తూర్పు, ఈశాన్య భారతం అంతటిలో కొల్లేరు ప్రాంతంలో పెంచిన చేపలే ప్రస్తుతం ఆహారం. బీహార్ నుంచి మంత్రులు ఇటీవల కొల్లేరు ప్రాంతానికి వచ్చి తమ రాష్ట్రంలో భూములనిస్తామని, చేపల పెంపకాన్ని చేపట్టమని ప్రోత్సహిస్తున్నారు.

కొల్లేరులో 5 అడుగుల దిగువన ఉన్న వడ్డీ కులస్తులలో కొన్ని బలమైన సంప్రదాయాలు శతాబ్దాలుగా వస్తున్నాయి. వాటిలో మొదటిది గ్రామాల చుట్టూ ఉన్న ప్రతి అంగుళం భూమిని కాపాడుకోవటం; రెండోది ఉమ్మడిగా ఆదాయాన్ని పంచుకోవటం. ఆ ప్రాంతంలో రికీ, రికి మధ్య సరిహద్దులనీ, భూమి మీద హక్కులని సంప్రదాయంగా స్పష్టంగా నిర్వచించుకున్నారు. నీటి ముంపునకు గురయినప్పుడు కూడా, చేపలుపట్టే హక్కు విషయంలో సరిహద్దు తగాదాలవల్ల రక్తపాతం, హత్యలు జరిగిన సందర్భాలున్నాయి. సొంత భూమి కాని, శతాబ్దాలుగా సాగుచేసుకుంటున్న, లేదా పంచుకుంటున్న ప్రభుత్వ భూమి కాని రెంటినీ ప్రాణాలొడ్డి కాపాడుకోవటం అక్కడి సంప్రదాయం. అక్కడ చేపల పెంపకం చేపట్టటం కష్టమై, మొదట్లో అప్పులలో కూరుకుపోయిన గ్రామస్తులు కాలక్రమేణా కొన్ని ప్రాంతాలలో ఓ కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టారు. పెట్టుబడిపెట్టి, శాస్త్రీయ పద్ధతులలో చేపల పెంపకాన్ని చేపట్టే రైతులను తమ గ్రామాలకు పిలిచి, బహిరంగ వేలంలో ఎవరికి కౌలుకివ్వాలో నిర్ణయించేవారు. కొత్తగా చెరువుల తవ్వకం, పెట్టుబడి అవసరమయితే కొంతకాలం ఎకరానికి రూ. 6000 నుండి 10,000కి, తవ్విన చెరువులయితే ఎకరానికి రూ. 20,000 నుంచి ఆపైన ఈ వేలంపాటలో నిర్ణయంచేసి ఆ రైతులకు కౌలుకివ్వటం ప్రారంభించారు. ఆ రైతులపైన విశ్వాసం లేకపోతే ముందుగానే కౌలు మొత్తం కట్టించటం అక్కడి ఆనవాయితీ. పెట్టుబడి, ఉత్పత్తి అమ్మకం, వ్యవసాయంలో రిస్కు, ఆపైన ఖర్చులు పోగా వచ్చే మిగులు - ఇవన్నీ రైతు సొంతం. నికరంగా ఎకరానికి వచ్చే రాబడి ఆ గ్రామస్తుల సొంతం. ఆ గ్రామాలలో ప్రజల అనుమతి లేకుండా ఒక్క ఎకరం కూడా సాగు కానీ, చేపల పెంపకంగానీ సాధ్యంకావు. ఇక గ్రామం మొత్తానికి చెందిన భూములపై వచ్చిన ఆదాయాన్ని ళ్లో ఉన్న ప్రతి కుటుంబం ఉమ్మడిగా తలకింతా చొప్పున పంచుకోవటం ఆ ప్రాంతంలోని వడ్డీల ప్రత్యేక సంప్రదాయం. ప్రతి పురుషుడికి, మహిళకి, పిల్లలకి ఇలా లెక్కగట్టి ఆదాయాన్ని పంచుకుంటారు.

కాలక్రమేణా చేపల పెంపంకం లాభసాటి కావటంతో ఇలా భూమిని కౌలుకి తీసుకోవటం కోసం ఇతర ప్రాంతాల రైతులు వేలంవెర్రిగా ఎగబడసాగారు. కొందరు కోటీశ్వరులు దూర ప్రాంతాల నుంచి వచ్చి, వేలం పాటల్లో లీజు మొత్తాన్ని పెంచి, వందల ఎకరాలను సాగుచేయటం ప్రారంభించారు. కొన్నిచోట్ల రైతులు మురుగునీటి కాలువల భూములను ఆక్రమించారు. ఇలా రైతులు డ్రెయిను పోరంబోకును ఆక్రమించుకోవటం మొత్తం 10 అడుగుల ప్రాంతం వరకు కానవస్తుంది. దీంతో, కొన్ని ప్రాంతాలలో వర్షం వచ్చినప్పుడు ముంపు బెడద ఎక్కువయ్యింది. ప్రభుత్వంలో రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు

లంచాలు మరిగి, డ్రెయినులని కూడా అడ్డుకునే అక్రమ తవ్వకాలను ప్రోత్సహించారు. ప్రభుత్వం డ్రెయిన్లని నిర్వహించటంలో, అడ్డు తొలగించటంలో పూర్తిగా విఫలమయింది. కొందరు కోటీశ్వరులు పెద్ద యెత్తున చేపల పెంపకాన్ని చేపట్టడంతో, పత్రికల వారిలో, ఇతర ప్రాంతాల ప్రజలలో చేపల చెరువుల పట్ల వ్యతిరేకత ప్రబలింది. ఇలా వచ్చిన పెద్ద రైతులను తొలగించి ఆ ప్రాంత చిన్న రైతులకు ఆ భూములనిచ్చే అధికారం ప్రభుత్వానికుంది. కాని ఏనాడూ ప్రభుత్వం ఆ దిశగా ఎటువంటి ప్రయత్నమూ చెయ్యలేదు.

"ప్రస్తుతం కొల్లేరు చుట్టుపక్కల అయిదు అడుగుల దిగువనున్న ప్రాంతాలలో, ఆ పరిసరాలలో రెండు లక్షల మందికిపైగా ప్రజలు ప్రత్యక్షంగా వ్యవసాయం మీద, చేపల పెంపకంపైన ఆధారపడి జీవిస్తు న్నారు. దాదాపు లక్ష మంది వ్యవసాయంలో, అనుబంధం సేవలలో, రవాణా, అమ్మకం వగైరా రంగా లలో ఉపాధి లభిస్తోంది. అక్కడ సంపద పెరిగింది; వలసలు తగ్గాయి; ప్రజల ఆరోగ్యం బాగుంది; ఉత్పత్తి, ఉపాధి, ప్రజల ఆదాయం పెరిగాయి. వ్యవసాయ రంగాన్ని గురించి ఆర్థికవేత్తలు, రాజకీయ పార్టీలు, పత్రికలు నిరంతరం చెప్పేది- సంపద సృష్టించాలి; ఉత్పత్తి, ఉపాధి పెంచాలి; వలసలను, ఆకలి చావులను అరికట్టాలి అని. గత 25 ఏళ్లలో కొల్లేరు ప్రాంతం ఈ లక్ష్యాలనన్నిటినీ సాధించింది. వ్యవ సాయ రంగంలో మార్పులు తెచ్చి గ్రామాలను అభివృద్ధి చేయటం, బీదరికాన్ని నిర్మూలించటం ఎలాగో కొల్లేరు ప్రాంత ప్రజలు ఆచరణలో రుజువుచేశారు.

ఈ వ్యవసాయాభివృద్ధిలో కొన్ని అపశ్రుతులు దొర్లాయి. కొన్నిచోట్ల డ్రెయిన్లు అడ్డుకున్నారు. ఆ ఆక్రమణ లను తొలగించి మురుగునీరు పారేలా చెయ్యాలి. పైనుంచి పరిశ్రమలు, పట్టణాల కాలుష్యం కొల్లేరు నీటిని విషపూరితం చేస్తున్నాయి. అది చేపలకు, ఇతర జీవులకి ప్రమాదం. ఆ కాలుష్యాన్ని అరికట్టాలి. కోటీశ్వరులు కొందరు వందలాది ఎకరాలను లీజుకు తీసుకుంటున్నారు. అలాంటి బడాబాబులని తొల గించి, ఆ ప్రాంతంలోని చిన్న రైతుల చేతుల్లో ఆ ఆస్తులను, ఉత్పత్తిని పెట్టాలి. ప్రజల ఆదాయంతో పాటు ఆ ప్రాంతంలో సంపదను పెంచడానికి ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి.

కాని బాధ్యత విస్మరించి పాలనా యంత్రాంగం ఆ ప్రాంతాన్ని వన్యప్రాణి రక్షణ చట్టం కింద ప్రకటిం చింది. రైతుల స్వంత భూములలో, పట్టాభూములలో ఉన్న చేపల చెరువులను సైతం ధ్వంసం చేస్తోంది. అక్కడ జరిగే ఉత్పత్తిని ఆపేసింది. ఉపాధి అంతరిస్తోంది - మళ్లీ గతంలోలాగా - జలగల బెడద, నత్తమాంసం, తూటికూర, ఆహారం లోపం, అనారోగ్యం, బీదరికం - అమాయక ప్రజలను కష్టాల లోకి నెడుతోంది. డ్రెయినుల పూడిక తీయడానికి బదులు ఆడ్డుకట్ట వేస్తోంది. ఈ రైతులకు, ప్రజలకు నష్టపరిహారం చెల్లింపు, పునరావాస కల్పన మాటేలేదు. అదేమంటే, రూ. 600 కోట్లు పంట ఏటా ఉత్పత్తి అయ్యే ప్రాంతంలో ఒక్కసారి రూ. 30 కోట్లు పునరావాసానికి కేటాయిస్తామంటున్నారు. రాజ్యాంగ విలు వలను పేద ప్రజల బ్రతుకులను నేలరాస్తున్నారు. చుట్టూ అటవీశాఖ చెక్‌పోస్టులను పెట్టి, ప్రతి వస్తు

వుకి, ప్రతి గంపకీ లంచాలు మింగుతున్నారు. వ్యవసాయాన్ని నేరంగాను, ఉత్పత్తిని పాపంగాను చిత్రిస్తు న్నారు. చేపల పెంపకాన్ని - దొంగనోట్ల ముద్రణ, స్మగ్లింగ్ వంటివాటి సరసన చేర్చదగిన నేరంగా భావి స్తున్నారు.

## *కనీస హక్కులను కాలరాస్తున్నారు*

ఇలా ప్రజల కనీస హక్కులను, జీవితాలను కాలరాస్తుంటే అది ప్రజాస్వామ్యమెలా అవుతుంది? లక్షల మందిని బీదరికంలోకి నెడుతుంటే అది అభివృద్ధి ఎలా అవుతుంది? పిల్లిని మూలనపెట్టి ఎదురు తిరిగే దాకా కొడితే అది విజ్ఞత ఎలా అవుతుంది? ప్రతి గ్రామంలో, ప్రతి వ్యక్తీ కంటతడిపెడుతుంటే, ఆదుకోవ లసిన వాళ్లే అన్యాయం చేస్తున్నారని ఆక్రోశిస్తుంటే, సుఖశాంతులెలా వర్ధిల్లుతాయి? కొల్లేరు ప్రాంత సమ స్యలకు హేతుబద్ధమయిన, న్యాయమయిన పరిష్కారాలు పుష్కలంగా ఉన్నాయి. ఆదాయాన్ని పెంచుతూ, మురుగునీటి పారుదలకు అడ్డంకులు తొలగించాలి; ముంపును ఆపాలి. బడాబాబులను తొల గించి, చిన్న రైతులను ప్రోత్సహించాలి. కాలుష్యాన్ని అరికట్టి, పర్యావరణంలో వీలయినంత సమతూకాన్ని సాధించాలి. ఇవన్నీ స్థానిక ప్రజల జీవితాలను బలిపెట్టకుండా సాధించడం సాధ్యమే. అందుకు రాజ కీయ పార్టీలు, పత్రికలు, ప్రభుత్వం విషయాన్ని లోతుగా పరిశీలించాలి. అక్కడి పిల్లల కళ్లల్లో ఆశాదీ పాలు ఆరిపోకుండా నిర్ణయాలు తీసుకోవాలి. జరుగుతున్న అనర్థాన్ని అర్థంచేసుకోవాలి. కొల్లేరు సమ స్యకు సంబంధించి అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కార మార్గాలేమిటో తర్వాతి వ్యాసంలో వివరి స్తాను.